# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఈరోజు నుంచి 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయి.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది.**
3. **ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది.**
4. **తెలంగాణా ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ఈరోజు మధ్యాహ్నం విడుదలవుతాయి.**
5. **ప్రముఖ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు జయంతి ఈరోజు.**

==========================

18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతుంది. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు భర్తృహరి మహతాబ్ కొత్తగా ఎన్నికైన లోక్‌సభ ఎంపీలతో ప్రమాణం చేయిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలుత ప్రమాణస్వీకారం చేయమన్నారు. అనంతరం ప్రధాన ప్రతిపక్షనేత, ఆ తర్వాత మంత్రులు, లోక్ సభ సభ్యులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ నెల 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగనుంది. 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే రాజ్యసభ సమావేశాలు కూడా ఈనెల 27వ తేదీన ప్రారంభమవుతాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం అవుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు ఉదయం 10 గంటలకు మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ క్యాబినెట్ సమావేశంలో హామీల అమలు, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నూతన బడ్జెట్ రూపకల్పన తదితర అంశాలపై చర్చించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు నుంచి ప్రతి సోమవారం ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు

స్వీకరించడానికి ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఈరోజు నుంచి అమలు చేయనున్నారు. కలెక్టర్ కార్యాలయాలతో పాటు అన్ని డివిజినల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఉదయం 10గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణా ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు విడుదల చేయనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. మే 24 నుండి జూన్ 3వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

నీట్–యూజీ పరీక్షలో పేపర్ లీకేజీ ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ–సీబీఐ కేసును నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో పేపర్ లీకేజీ పై దేశవ్యాప్తంగా నమోదైన కేసులను సమగ్ర విచారణ జరిపేందుకు సీబీఐ చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పేపర్ లీకేజీ విషయంలో ప్రమేయం ఉన్న వ్యక్తి లేదా సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించింది.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్ లో సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణంపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యా బోధనకు వీలుగా తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మించనున్నామన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. తొలివిడతగా కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

హైదరాబాద్ –విజయవాడ జాతీయ రహదారి– ఎన్‌హెచ్ 65పై ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాలను గుర్తించామని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా చిట్యాలలో జాతీయ రహదారి పైవంతెన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్ల వద్ద తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారితో పాటు, ఇతర రహదారులకు నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజుల్లో మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆయన రాష్ట్ర

రవాణా, క్రీడల శాఖ మంత్రిగా నిన్న అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇచ్చే శిక్షణ కేంద్రాల ఏర్పాటుపై తొలి సంతకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ, కర్ణాటకలో ఉచిత బస్సు సౌకర్యంపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆర్టీసీలో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా వసతులు మెరుగుపరిచి, ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రముఖ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు జయంతి ఈరోజు, తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించిన ఆయన... 1915 జూన్ 24వ తేదీన ఆంధ్రప్రదేశ్లోని పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహితీ జీవన యానంలో 60 కథలు, 8 నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు, నాటకాలు రచించారు. పద్మరాజు రాసిన 'గాలి వాన' కథ ప్రపంచ కథానికల పోటీలో 2వ బహుమతి గెలుపొంది.. సాహితీ చరిత్రలో గౌరవస్థానాన్ని సంపాదించింది. తెలుగు చలన చిత్ర రంగంతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. మూడు దశాబ్దాల పాటు పాలగుమ్మి కలం నుండి అనేక సినిమాలకు కథలు, పాటలు, మాటలు జాలువారాయి.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయవ్యవస్థ స్థానంలో నూతనంగా రూపొందించిన మూడు నేర చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి, నేరశిక్షా స్మృతి, భారత సాక్షాధార చట్టం 1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా చట్టాలను వర్తింపజేయనున్నారు. ఈ చట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అధిక మొత్తంలో నిధులు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర పార్లమెంటు సభ్యులు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సూచించారు. అమరావతిలో నిన్న జరిగిన తెలుగు దేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈరోజు నుండి జరగనున్న పార్లమెంటు సమావేశాలలో చర్చించవలసిన అంశాలపై ... అనుసరించవలసిన వైఖరిపై రాష్ట్ర పార్లమెంటు సభ్యులతో చంద్రబాబు నాయుడు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కొక్క పార్లమెంటు సభ్యునికి తాను మూడు శాఖల నుండి నిధులు పొందే బాధ్యతను అప్పగిస్తానని, ఆ సభ్యుడు సంబంధిత మంత్రితో సమన్వయంతో వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ మొత్తంలో నిధులు రాబట్టాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రతి పార్లమెంటు సభ్యుని ప్రథమ ప్రాధాన్యం కావాలని సూచించారు.

---------------------------

కేంద్ర నిధులతో గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పి. చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో నిన్న నగరపాలక సంస్థ పరిధిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై స్థానిక శాసనసభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గుంటూరు నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను

ఆదేశించారు. నగరంలో తాగునీరు సరఫరా, మురుగునీటి వ్యవస్థ, రహదారులు, వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గుంటూరు నగరవాసులకు కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుండి మూడు రోజుల పాటు పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అనకాపల్లి, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల జిల్లాలలో తేలికపాటి వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణా రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాదు, నిజామాబాదు, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాదు, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్ తదితర జిల్లాలలో ఈ రోజు, రేపు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. మరో వైపు హైదరాబాదు నగరంలో నిన్న అనేక ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. ఫిల్మ్ నగర్, బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, అమీర్ పేట, ఎల్.బి. నగర్, నాగోల్, మలక్ పేట తదితర ప్రాంతాలలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న నిర్వహించిన కళ్యాణోత్సవంలో మంత్రి పాల్గొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో ఎంతో చారిత్రక విశిష్టత కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కళ్యాణ వేదికను అభివృద్ధి చేయడంతో పాటు క్యూ లైన్లలో కూడా అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు.

======================